క్లుప్తంగా

ఎన్డీఏ ప్రభుత్వ విద్వేష పాలన తిప్పికొట్టాలి



నెహ్రూనగర్: అంబేడ్కర్ కలలు గన్న సమసమాజ నిర్మాణం కోసం, అట్టడుగు ప్రజల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం బహుజన నాయకుడుగా మనువాద పార్టీలతో పోరాడుతున్న ప్రజా నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్ అని రాష్ట్రీయ జనతాదళ్(ఆర్‌జేడీ)ఏపీ, తెలంగాణ ఉపాధ్యక్షుడు బూరగ రత్నం పేర్కొన్నారు. ఆర్‌జేడీ వ్యవస్థాపకులు, బిహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ జన్మదినోత్సవం సందర్భంగా బ్రాడీపేటలోని ఆర్‌జేడీ కార్యాలయంలో ఆదివారం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా కుల, మత, ప్రాంతీయ విద్వేషాల నడుమ బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం విద్వేషపూరిత పాలన సాగిస్తోందని విమర్శించారు. దశాబ్దాలుగా కులగణన జరపకపోవడం అధికార పార్టీ దురహంకారాన్ని చాటి చెబుతోందని తెలిపారు. సమావేశంలో నాయకులు ఏబేలు, నల్లపు నీలాంబరం, ధనరాజ్, కొండా శేఖర్, శ్రీనివాస యాదవ్, వేణుగోపాల్ యాదవ్, గాయత్రి, షేక్ సలీమా పాల్గొన్నారు.

తొగట వీర క్షత్రియుల సంక్షేమానికి కృషి



నెహ్రూనగర్: తొగట వీర క్షత్రియుల సంక్షేమానికి నూతన కార్యవర్గం చిత్తశుద్ధితో పని చేస్తుందని శ్రీ చౌడేశ్వరి తొగట వీర క్షత్రియ సేవా సంఘం నూతన అధ్యక్షుడు అనంత మల్లికార్జున పేర్కొన్నారు. లాలాపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2023, 24 సంవత్సరాలకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా పూజల అర్జున్, కోశాధికారిగా కాలా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా పోస చౌడేశ్వరరావు, నీలం చలమయ్య, ఉప కార్యదర్శులుగా వీర్నాల వెంకటేశ్వర్లు, బొమ్మిశెట్టి మార్కండేయులు, కోశాధికారిగా కుమార్ రాజు, కార్యవర్గ సభ్యులుగా గుండిగ ఆంథోని, శీలం మల్లికార్జునరావు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు వెనిగళ్ల కోటేశ్వరరావు, కనిగిరి రామారావు, పప్పులేటి ప్రసాద్, బి. కుమార్, జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధను ఉష, ఉద్యోగ సంఘ అధ్యక్షుడుడు కనిగిరి శివతో పాటు జిల్లాలోని అన్ని మండలాల సంఘాల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతో పాటు వ్యాయామం అవసరమే...



నెహ్రూనగర్: పిల్లలకు చదువుతో పాటు, ఆటపాటలు, వ్యాయామం కూడా ఉండాలని 15వ డివిజన్ కార్పొరేటర్ రామనబోయిన అజయ్, వైఎస్సార్ సీపీ తూర్పు మహిళ నాయకులు నూరి ఫాతిమా పేర్కొన్నారు. డివిజన్‌లోని హుస్సేన్ నగర్‌లో గల కొత్త మర్కస్ మసీదులో ఆదివారం హోప్ విన్ హాస్పిటల్ డాక్టర్ నజీరుద్దీన్ ఆధ్వర్యంలో చిన్నారులకు ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో మిర్చి యార్డ్ డైరెక్టర్ మున్వర్, మైనార్టీ నాయకులు మస్తాన్‌వలీ, తహ, ఇమ్రాన్, రబ్బానీ, షేక్ నగిన చాంద్ బాష, ఫరూక్ పాల్గొన్నారు.

వైభవంగా శత చండీయాగం



పాత గుంటూరు: ఏటీ అగ్రహారంలోని శ్రీ కంచి కామకోటి పీఠ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరంలో ఆదివారం శత చండీ యాగం వైభవంగా నిర్వహించారు. ఉదయం సూర్య నమస్కారాలు, మహాలింగార్చన, వేద పారాయణతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తిశ్రద్ధలతో చండీ హోమం, మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఏర్పాట్లను శత చండీయాగ కమిటీ పర్యవేక్షించింది.

మాజీ సీఎం రోశయ్య విగ్రహ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే మద్దాళి గిరి

నెహ్రూనగర్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. నగరంలోని హిందూ కాలేజీ జంక్షన్ వద్ద ఆయన విగ్రహ ఏర్పాటుకు ఆదివారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కొణిజేటి రోశయ్యది ప్రత్యేక శైలి అన్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో కీలకభూమి పోషించారని తెలిపారు. ఎన్నో పదవుల్ని అధిరోహించి, రాజకీయాలకే వన్నె తెచ్చారని వివరించారు. తమిళనాడు గవర్నర్‌గా సమర్థంగా విధులు నిర్వహించారని చెప్పారు. ఆయన విద్యాభ్యాసం చేసిన హిందూ కాలేజీ కాలేజీ జంక్షన్‌లో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, గేదేల రమేష్, కొత్తపేట శివాలయం చైర్మన్ మొగిలి సతీష్ కుమార్, ఆర్య వైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

ఆచార్య హరిబాబుకు పురస్కారం ప్రదానం



హరిబాబును సత్కరిస్తున్న పయ్యావుల పార్వతి, శ్రీనివాసరావు తదితరులు

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఆత్మీయ ఆర్ట్స్ థియేటర్ సీహెచ్. సాంబయ్య స్మారక పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో సాంబయ్య 34వ వర్ధంతి సందర్భంగా ఆదివారం అవార్డు ప్రదానోత్సవ సభ నిర్వహించారు. సభకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్. భాస్కరరావు అధ్యక్షత వహించారు. అతిథులుగా రాష్ట్ర స్కూలు ఎడ్యుకేషన్ డైరెక్టర్ పయ్యావుల పార్వతి, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం ఆర్థికాధికారి కె. శ్రీనివాసరావు, దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి. హరిబాబును విద్యా ప్రదాత సీహెచ్. సాంబయ్య స్మారక అవార్డుతో ఘనంగా సత్కరించారు. సభానంతరం శ్రీ సాయి కార్తిక్ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ఎడారిలో వాన చినుకు నాటికను ప్రదర్శించారు. శారదా ప్రసన్న రచనకు, సీహెచ్. మహేష్ దర్శకత్వం వహించారు. కార్యక్రమంలో ఏఎన్‌యూ విశ్రాంత జాయింట్ రిజిస్ట్రార్ వాసా మాణిక్యాలరావు, ఆలయ అధ్యక్షుడు సీహెచ్. మస్తానయ్య, డి.ఎ.ఆర్. సుబ్రహ్మణ్యం, హిందీ పండితుడు పారేపల్లి భార్గవ రామ దుర్గాప్రసాద్, సీహెచ్. చైతన్య పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 35 రోజులుగా నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం ముగిసింది. సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ మాట్లాడుతూ పుస్తక పఠనం మనిషిని పరిపూర్ణుడిగా తీర్చిదిద్దుతుందన్నారు. ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం పెంపొందించడంలో ఎంతగానో దోహదం చేస్తుందని తెలిపారు. కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పెంచుకునేందుకు వేసవి విజ్ఞాన శిబిరాలు ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు.అనంతరం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సీహెచ్. దీక్షితులు, ఉప గ్రంథపాలకురాలు కె.ఝాన్సీలక్ష్మి, సిబ్బంది చిన్నప రెడ్డి, పర్వీన్ సుల్తాన్, అచ్చమ్మ పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలను విడుదల చేస్తున్న వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ తదితరులు

కొమ్మూరు(కాకుమాను): రాష్ట్రంలో అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సాహెబ్ (జిలాని)అన్నారు. మండలంలోని కొమ్మూరు మసీదులో 'హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ జగన్‌కే సాథ్' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ క్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టి అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో పథకాల్ని అందిస్తున్న ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. రాష్ట్ర కేబినెట్‌లో సైతం ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పొన్నూరు షేక్ కరిముల్లా, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముజావర్ షేక్ లతీఫ్ పాల్గొన్నారు.

హైజంప్ క్రీడాకారుడికి అభినందన



క్రీడాకారుడు షేక్ మొహిద్దీన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే సుచరిత తదితరులు

గుంటూరు రూరల్: జాతీయ స్థాయిలో ఆంధ్ర రాష్ట్ర ఖ్యాతిని పెంచిన క్రీడాకారునికి ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అభినందనలు తెలిపారు. కాకుమాను మండలం రేటూరు గ్రామానికి చెందిన షేక్ మొహిద్దీన్ హైజంప్‌లో జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ సాధించాడు. ఆదివారం ఎమ్మెల్యేను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షేక్ మొహిద్దీన్‌ను అభినందించారు. మరింత క్రీడా నైపుణ్యతలు పెంచుకుని రాష్ట్రానికి, భారతదేశానికి కీర్తి, ప్రతిష్టలు తీసుకురావాలని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వల్లూరి సుధాకర్, కో-ఆప్షన్ సభ్యుడు షేక్ సుబాని, దాద్ బుడ సుబాని, వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ కరీముల్లా పాల్గొన్నారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ

ప్రత్తిపాడు మండలం కొండెపాడు గ్రామస్తులు గత వారం ట్రాక్టర్ ప్రమాదంలో గాయపడి గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సంఘటన తెలిసిందే. ప్రమాదం జరిగిన రోజు నుంచి బాధితుల్ని కలుస్తూ, వారి ఆరోగ్యం, చికిత్సల గురించి మాజీ మంత్రి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత వాకబు చేస్తూనే ఉన్నారు. ఆదివారం గుంటూరు ప్రభుత్వాసుపత్రికి ఎమ్మెల్యే చేరుకుని నేరుగా బాధితుల్ని కలిశారు. వైద్యుల్ని కలసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో జెండా పండుగ



ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే సుచరిత

కొమ్మూరు(కాకుమాను):మండలంలోని కొమ్మూరులో శనివారం జెండా పండుగను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచి జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన జెండాను ఆదివారం వేకువజాము వరకు గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్న సంతర్పణ నిర్వహించారు. రాత్రి నిర్వహించిన ప్రార్థనల్లో ప్రత్తిపాడు శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత పాల్గొన్నారు. కుల, మతాలకు అతీతంగా అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివ రామకృష్ణ, కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు ముజావర్ షేక్ గుల్జార్ బేగం, మత పెద్దలు పాల్గొన్నారు.

పెదనందిపాడు పోలీస్ స్టేషన్ తనిఖీ

పెదనందిపాడు: స్థానిక పోలీస్ స్టేషన్‌ను గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్ బాషా ఆదివారం రాత్రి తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డుల్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో పలు కేసుల వివరాల్ని అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ప్రత్తిపాడు సీఐ సుబ్బారావు, ఎస్‌ఐ అబ్దుల్ రెహమాన్ ఉన్నారు.

రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ మెంబర్‌గా వరప్రసాద్



నెహ్రూనగర్: జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్‌టేటివ్ కమిటీ(జెడ్‌ఆర్‌యూసీసీ) మెంబర్‌గా గుంటూరుకు చెందిన ఓబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు దక్షిణ మధ్య రైల్వే డీజీఎం, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్య కార్యదర్శి కె. ముత్యాలనాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడిగా ఎన్నికైన అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ ఆదివారం బ్రాడీపేటలోని ఓ హోటల్‌లో విలేకరులతో మాట్లాడారు. తన నియామకానికి సహకరించిన కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, రైల్వే బోర్డు చైర్మన్ అనిల్‌కుమార్ లహోటి, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలియజేశారు. నాలుగు రాష్ట్రాల విస్తీర్ణం కలిగిన దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో ప్రయాణికుల సంక్షేమానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. అనంతరం బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘ నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

అలరించిన సినీ సంగీత విభావరి

పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో శ్రీశుభాంజలి కళావేదిక, చిలకా ప్రసాదరావు మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్ రాసంశెట్టి నరసింహారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరి, హాస్యవల్లరి, డాన్సులు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. గాయకులు పత్రి గాయత్రి, అత్తోట సౌజన్య, మేకల పురుషోత్తమ ప్రసాద్, చీకటి రవికాంత్, డాక్టర్ సి.వి.యస్ రామకృష్ణ, దొప్పలపూడి శ్రీనివాసరావు, పాగళ్ల మోహనరావు, కోటేశ్వరరావు పలు సినీ పాటల్ని ఆలపించారు. హాస్యవల్లరిలో నటులు కమలకంటి వలి, వి.వి.ఎన్. ఆచారి, శివయ్య, రవి, లతశ్రీ పలు నాటికలు ప్రదర్శించి ప్రేక్షకుల్ని ఉత్సాహపరిచారు. పాటలకు వలి డాన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమాన్ని ఎన్నుబర్ల బ్రహ్మం, సిరిగిరి గణేష్, కటారి ముత్యాలరావు ,తుమ్మేటి శ్రీనివాసరావు, పాగళ్ల మోహనరావు, ఆనందరావు, సాగర్ పర్యవేక్షించారు.

ఘనంగా ఎమ్మెల్యే కిలారి జన్మదిన వేడుకలు



చేబ్రోలు: పొన్నూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఆదివారం ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించారు. తొలుత జీబీసీ రహదారి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గుర్రం మీద సభా వేదిక వద్దకు చేరుకున్నారు. బాణసంచా, తీన్‌మార్ డప్పుల హోరుతో పార్టీ నాయకులు, శ్రేణులు ఎమ్మెల్యే రోశయ్యకు అభినందనలు తెలిపారు. పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను ఆయన కట్ చేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు, అభిమానులు ఎమ్మెల్యేను బొకెలు, పూలమాలలతో అభినందించారు. క్రేన్ సహాయంతో గజమాలతో సన్మానించారు. రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణరావు, మార్కెట్టు యార్డు చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, ఎంపీపీలు భవనం పద్మలీల, కె. సాహితి, టి. శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బొద్దులూరి రంగారావు, కుర్రా పాములు, గూడవల్లి గంగాధర్, నయూమ్ బాషా, చందు సాంబశివరావు, పెరికల కృష్ణ మోహన్, భవనం విజయలక్ష్మి, ఆకుల రామ్మోహన్, కాసు ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

శివాలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

పెదకాకాని: స్థానిక శివాలయంలో శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య దంపతులు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు. మండలంలోని వెంకట కృష్ణాపురంలో సాయంత్రం ఎమ్మెల్యే కిలారి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేశారు.

వామపక్షాల ఆధ్వర్యంలో 'అమిత్ షా గో బ్యాక్'



నిరసనలో వామపక్ష పార్టీల నాయకులు

పాత గుంటూరు: ఆంధ్ర రాష్ట్రంపై వివక్ష చూపిస్తున్న బీజేపీ ప్రభుత్వ విధానాలు నశించాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో 'ఆంధ్ర ద్రోహి అమిత్‌షా గో బ్యాక్' అంటూ ఆదివారం బ్రాడీపేట శంకర్ విలాస్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. సీపీఎం నగర కార్యదర్శి కె. నళినీకాంత్, సీపీఐ నాయకులు అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన నిరసనలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు గనిరాజు పాల్గొని మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీ చట్టాలు అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం తీరని ద్రోహం చేసిందని తెలిపారు. ప్రాణ త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ఫోక్స్ కంపెనీకి కారు చౌకగా అమ్మేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. విశాఖ ఉక్కును అమ్మాలని చూస్తే ఆంధ్రప్రదేశ్ ప్రజలు చూస్తూ ఊరుకోరని వామపక్ష నాయకులు హెచ్చరించారు. పెట్రోలు, డీజీలు, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపిందని తెలిపారు. ఆంధ్ర ప్రజల్ని దారుణంగా అన్యాయం చేసిన నరేంద్ర మోదీకి, అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్. భావన్నారాయణ, ఈమని అప్పారావు, జిల్లా కమిటీ సభ్యులు భైరిగాని శ్రీనివాసరావు, లక్కా అరుణ, నగర కార్యదర్శివర్గ సభ్యులు కట్లగుంట శ్రీనివాసరావు, నగర కమిటీ సభ్యులు షేక్ ఖాశీం షహీద్, ఎస్. కార్తిక్, షేక్ ఖాశీం వలి, సీపీఐ నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, జిల్లా నాయకులు ఎం. హనుమంతరావు పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు సరుకుల పంపిణీ



వృద్ధులకు కిట్‌లను అందిస్తున్న సమితి సభ్యులు

నగరంపాలెం: ఆపన్నులకు సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. కొత్తపేట జానీ కాంప్లెక్ ఆవరణలోని సమితి కార్యాలయంలో ఆదివారం యాభై మంది వృద్ధులు, దివ్యాంగులకు బియ్యం, పది రకాల నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి నెలా రెండో వారంలో ఉచిత సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పి.వి.సుబ్రహ్మణ్యం, మాదల ప్రకాశ్, పి.రజనీశ్వరరావు, ఎస్. వి.రమణ, ఎం.శ్రావణ్, పలకలూరి శివరావు పాల్గొన్నారు.

గుండెపోటు ముప్పును ముందుగానే గుర్తించవచ్చు

డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

గుంటూరు మెడికల్: క్యాల్షియం స్కోర్, సీటీ కరోనరి యాంజియోగ్రామ్ పరీక్ష ద్వారా గుండెపోటు ముప్పును కొన్ని సంవత్సరాల ముందే తెలుసుకోవచ్చని రమేష్ హాస్పిటల్స్ చీఫ్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. ఈ పరీక్షల ద్వారా యువతలో ఆకస్మికంగా సంభవించే గుండెపోటు మరణాల్ని 80 శాతం నివారించవచ్చని చెప్పారు. ఆదివారం గుంటూరు వైద్య కళాశాల జింఖానా ఆడిటోరియంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) గుంటూరు శాఖ, రమేష్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిరంతర వైద్య విద్య కార్యక్రమం(సీఎంఈ) నిర్వహించారు. డాక్టర్ రమేష్‌బాబు మాట్లాడుతూ శాస్త్రీయ పరంగా, సాంకేతికంగా ప్రపంచవ్యాప్తంగా గుండెజబ్బుల వైద్యంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. వైద్యులు వాటిపై అవగాహన పెంచుకోవడం ద్వారా గుండెపోటు మరణాల్ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. అత్యాధునిక ఎఫ్‌ఎఫ్‌ఆర్, ఐఎఫ్‌ఆర్ వంటి పరీక్షలతో జన్యుపరంగా సంభవించే గుండె జబ్బుల్ని ముందే గుర్తించవచ్చని వెల్లడించారు. సీఎంఈకి ముఖ్య అతిథిగా పాల్గొన్న గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి మాట్లాడుతూ వైద్య రంగంలో వస్తున్న నూతన విధానాల్ని వైద్యులు సీఎంఈల ద్వారా ఎప్పటికప్పుడు అందిపుచ్చుకున్నప్పుడే రోగులకు శాస్త్రీయ పద్ధతుల్లో వైద్యం అందుతుందని తెలిపారు. మెడికల్ కౌన్సిల్ పరిశీలకులు డాక్టర్ కోట సురేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో వైద్యులు అత్యధిక ఒత్తిడితో పని చేస్తున్నారని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఆవుల శ్రీనివాస్, సెక్రటరీ డాక్టర్ వెలగా మహేష్, డాక్టర్ హరిత, కుమార్ వేలు, డాక్టర్ జయరామ్‌పాయ్, డాక్టర్ రాజారమేష్, డాక్టర్ రామారావు పాల్గొన్నారు.

పెరియార్ శాస్త్రీయ భావాలే ప్రజాస్వామ్యానికి రక్ష



సదస్సు ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న విల్సన్, సుభాని, బాబూరావు తదితరులు

పాత గుంటూరు: పెరియార్ శాస్త్రీయ భావాలే ప్రజాస్వామ్యానికి రక్ష అని అంబేద్కర్, జాషువా, పూలే, పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బత్తుల విల్సన్ అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 16న నిర్వహించనున్న పెరియార్ – సమకాలీనత సదస్సు ఆహ్వాన పత్రికల్ని ఆదివారం బ్రాడీపేటలోని హోటల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విల్సన్ మాట్లాడుతూ మతాలు, కులాలుగా విడిపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పెరియార్ ఆలోచనలు సమాజానికి చాలా అవసరమని తెలిపారు. జన సమీకరణలో భాగంగా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో ప్రచార కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో కవులు ఎస్.ఎం.సుభాని, బుర్రి కుమార్ రాజా, కళాకారులు బాబూరావు, చంద్రపాల్, ప్రజా సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, కనకవల్లి వినయ్, సీనియర్ పాత్రికేయులు బండారు సురేష్ బాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారం పేరిట మోసం

గుంటూరు ఈస్ట్: వ్యాపారం పేరుతో మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. కొరిటిపాడుకు చెందిన షేక్ ప్రతీష్ ఫొటోగ్రాఫర్‌గా జీవనం సాగిస్తుంటాడు. అతడికి నెహ్రూనగర్‌కు చెందిన లాం జీవన్‌కుమార్ పరిచయం అయ్యాడు. ఆయిల్ వ్యాపారం చేస్తే లాభాలు వస్తాయని ప్రతీష్‌ను నమ్మించి రూ. 19 లక్షలు పెట్టుబడిగా తీసుకున్నాడు. మొదట లాభాలు వచ్చాయని రూ. 2 లక్షలు చెల్లించాడు. అనంతరం వ్యాపారం సాగడం లేదని చెప్పి మోహం చాటేశాడు. దీంతో మే 28న ప్రతీష్ డబ్బుల విషయమై జీవన్‌కుమార్‌ను నిలదీశాడు. ఈ సమయంలో ప్రతీష్‌పై జీవన్‌కుమార్ దాడి చేశాడు. ప్రతీష్ ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని ...

ఉద్యోగం పేరుతో ఓ మహిళను మోసం చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కంకరగుంట 3వ లైనులో నివసించే కె.మల్లేశ్వరికి అదే ప్రాంతానికి చెందిన ప్రభాకరరావు పరిచయం అయ్యాడు. ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి మల్లేశ్వరి వద్ద విడతలుగా రూ. 5 లక్షలు తీసుకున్నాడు. ఉద్యోగం ఇప్పించకుండా మోసం చేశాడు. మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

వ్యక్తిపై పలువురు దాడి చేసిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేసారు. మహాత్మాగాంధీ కళాశాల సమీపంలోని అంజిరెడ్డి కన్వెషన్ హాలులో ఈ నెల 10న వివాహం జరుగుతుండగా ఓ వాహనం లోపలకు వచ్చి నేల మీద వేసిన మ్యాట్‌లను డ్యామేజీ చేసింది. ఇదేమిటని ప్రశ్నించిన మేనేజర్ నాగవర్ధన్‌రెడ్డిపై పెళ్లి కొడుకు బంధువులు దాడి చేసి కొట్టారు. ఆదివారం నాగవర్ధన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకౌంట్స్‌లో అవకతవకలపై కేసు నమోదు

షాపులో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు పెద్ద మొత్తంలో నగదు స్వాహా చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న సంగీత మొబైల్స్‌లో పనిచేసే మేనేజర్ షేక్ హర్షద్ బాషా, క్యాషియర్ షేక్ ఫిరూజ్ షాపు లావాదేవీల లెక్కల్లో అవకతవలకు పాల్పడ్డారు. అకౌంట్స్ పరిశీలించిన సేల్స్ ఎగ్జిక్యూటివ్ రమేష్ , ఇద్దరు రూ.5,92,000 అవకతవకలకు పాల్పడ్డారని నిర్ధారించారు. ఈ మేరకు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 9 గంటల నుంచి నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 గంటలకే అర్జీల రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు స్పందన జరుగుతుందన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యల్ని నేరుగా తన దృష్టికి తీసుకు రావచ్చని ఆమె పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

తిమ్మాపురం (ప్రత్తిపాడు): పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురు జూదరుల్ని ప్రత్తిపాడు పోలీసులు అరెస్టు చేశారు. ప్రత్తిపాడు మండలం తిమ్మాపురం గ్రామ శివారుల్లోని ఖాళీ ప్రదేశంలో కోతముక్కాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో ఎస్‌ఐ డి. రవీంద్రబాబు సిబ్బందితో దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి, రూ. 1150 స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.